

తెలంగాణ భవన్‌లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు; చిత్రంలో మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, తాటికొండ రాజయ్య, మాజీ ఎంపీ మాలోతు కవిత, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, డాక్టర్ సంజయ్, కాలేరు వెంకటేశ్, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

రేవంత్.. బిగిపో!

> 2015 ఓటుకు నోటు కేసు చూశాం. నోట్ల కట్టలతో రేవంత్‌రెడ్డి పట్టుబడ్డారు. ఆ తర్వాత నుంచీ రేవంత్‌రెడ్డిని 'బ్యాగ్‌మాన్' అని పిలుస్తున్నారు. నాటిది ఓటుకు నోటు కేసు.. నేటిది సీటుకు రూట్ కుంభకోణం. -కేటీఆర్

మొదటిపేజీ తరువాయి...

నైతికత ఉంటే రేవంత్‌రెడ్డి స్వచ్ఛందంగా ముఖ్యమంత్రి పదవి నుంచి తప్పుకోవాలని, లేదంటే కాంగ్రెస్ అధిష్ఠానం ఆయనను ఆ పదవి నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. కర్ణాటకలో డీకే శివకుమార్‌ను అక్కడి బీజేపీ నేతలు విమర్శిస్తుంటే, తెలంగాణ బీజేపీ నేతలు మాత్రం రేవంత్‌రెడ్డిని పల్లెత్తు మాట అనకపోవడం ఆ రెండు పార్టీల మధ్య ఉన్న అపురూప సంబంధానికి నిదర్శనమని మండిపడ్డారు. విచ్చలవిడిగా స్కామ్‌లు చేస్తున్న తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మోదీ ప్రభుత్వం ఎందుకు కాపాడుతున్నదో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణభవన్‌లో శనివారం మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీ మాలోతు కవిత, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, డాక్టర్ సంజయ్, కాలేరు వెంకటేశ్, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, పార్టీ నేత రాగిడి లక్ష్మారెడ్డితో కలిసి కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. యంగ్ ఇండియన్, నేషనల్ హెరాల్డ్ కేసులో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేరును చార్జిషీట్‌లో ఈడీ చేర్చడం తెలంగాణ రాష్ట్రానికి అవమానకరమని కేటీఆర్ ఫైరయ్యారు.

> 17 నెలల్లోనే 44 సార్లు ఢిల్లీకి పోయిన సీఎం రేవంత్‌రెడ్డి అరుదైన రికార్డు సృష్టించారు. ఢిల్లీకి ఎందుకు పోతున్నారో ఇప్పుడు మాకు అర్థమైంది. చీకట్లో అమిత్‌షా కాళ్లు పట్టుకోవడం, ఈడీ కేసుల నుంచి తప్పించాలని వేడుకొనేందుకే వెళ్తున్నారు. -కేటీఆర్

రేవంత్‌రెడ్డికి బుద్ధిరావడం లేదు

గతంలో ఎన్నో తప్పులు చేసిన రేవంత్‌రెడ్డికి ఇప్పటికీ బుద్ధి రాలేదని కేటీఆర్ విమర్శించారు. '2015 ఓటుకు నోటు కేసు చూశాం. నోట్ల కట్టలతో రేవంత్‌రెడ్డి పట్టుబడ్డారు. ఆ తర్వాత నుంచీ రేవంత్‌రెడ్డిని 'బ్యాగ్‌మాన్' అని పిలుస్తున్నారు. నాటిది ఓటుకు నోటు కేసు.. నేటిది సీటుకు రూట్ కుంభకోణం. రూ.50 కోట్లు పెట్టి రేవంత్‌రెడ్డి పీసీసీ అధ్యక్ష పదవిని కొనుక్కున్నాడని నాటి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మీడియా ముందటనే చెప్పిండు. ఆనాడు కోమటిరెడ్డి చేసిన ఆరోపణలకు ఆరోజు ఆధారాలు లేకపోవచ్చు కానీ ఇప్పుడు చార్జిషీట్‌తో ఈడీ ఆధారాలు చూపించింది. ఎవరు డబ్బులు ఇచ్చారు? ఏ పొజిషన్‌ని అమ్ముకున్నారు? ఎన్ని డబ్బులు ఇచ్చారు? అనే వివరాలను ఈడీ తన చార్జిషీట్లో స్పష్టంగా బయటపెట్టింది. నాడు కాంగ్రెస్ నేతలు చెప్పిన మాట నేడు నిజమవుతున్నది. తెలంగాణ అనేది కాంగ్రెస్ పార్టీకి ఏటీఎంగా మారింది. ఢిల్లీ కాంగ్రెస్‌కు ఎప్పుడు డబ్బులు కావాలంటే అప్పుడు భారీ మొత్తంలో అందిస్తూ రేవంత్‌రెడ్డి తన పదవిని కాపాడుకుంటున్నారు. ఓటుకు నోటు జరిగినప్పుడు రేవంత్‌రెడ్డి ఎమ్మెల్యే. కానీ, ఇప్పుడు తెలంగాణ ముఖ్యమంత్రి. యావద్దేశం ముందు తెలంగాణ పరువు తీశారు. తెలంగాణ ముఖ్యమంత్రి అంటే ఇట్లాంటి వ్యక్తా? అనే పరిస్థితి కనిపిస్తున్నది' అని కేటీఆర్ ఎద్దేవా చేశారు.

తప్పుకోవాలి లేదా తప్పించాలి

'గతంలో కర్ణాటక ముఖ్యమంత్రిగా యడ్యూరప్ప ఉన్నారు. హౌసింగ్ స్కామ్‌లో ఆయన ఉన్నట్టు వార్తలు వస్తే నిష్పక్షపాతంగా విచారణ జరగాలంటే రాజీనామా చేయాలని కర్ణాటక కాంగ్రెస్ అధ్యక్షుడు అప్పట్లో డిమాండ్ చేశారు. ఇవాళ మేము అడుగుతున్నదని కూడా ఇదే. నిజాయితీ, నైతికత ఉంటే వెంటనే రేవంత్‌రెడ్డి స్వచ్ఛందంగా ముఖ్యమంత్రి పదవి నుంచి తప్పుకోవాలి. లేదంటే కాంగ్రెస్ అగ్రనాయకత్వం స్పందించి ఆయనను ఆ పదవి నుంచి తప్పించాలి. నిష్పక్షపాతంగా విచారణ జరగడానికి సహకరించాలి. రేవంత్‌రెడ్డి మాటల ముఖ్యమంత్రి కాదు.. మూటల ముఖ్యమంత్రి అని తేలిపోయింది. మూటలు ఇచ్చే పీసీసీ పదవి పొందారని వెంకట్‌రెడ్డి చెప్పిండు. మూటలు పంపుతూ ముఖ్యమంత్రి పదవిని కాపాడుకుంటున్నారని ఇప్పుడు దేశమంతా తెలిసింది. ఆఫీస్ బేరర్ల నుంచి మూటలు తీసుకొని ఆనాడు కాంగ్రెస్ పత్రికకు నిధులు అందించారని ఈడీ చెప్పింది' అని కేటీఆర్ పేర్కొన్నారు.



ఆర్ఆర్ ట్యాక్స్‌పై స్పందించని మోదీ

2024 మే 11న తెలంగాణ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణలో విచ్చలవిడిగా అవినీతి జరుగుతున్నదని రాహుల్– రేవంత్‌రెడ్డి ఆర్ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తున్నారని ఆరోపించారని కేటీఆర్ గుర్తుచేశారు. ఈ విషయంలో ఇప్పటిదాకా ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని విమర్శించారు. 'సివిల్ సప్లై స్కామ్‌లో జరిగిన కుంభకోణాన్ని మేం ఆధారాలతో సహా బయటపెట్టాం. ఈ స్కామ్‌లో ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా స్పందించదు. కేంద్ర ప్రభుత్వం స్పందించదు. కేంద్ర దర్యాప్తు సంస్థలు కూడా విచారణ జరపడానికి ముందుకు రావడం లేదు. అనేక స్కాములు వెలుగుచూస్తున్నాయి. రేవంత్‌రెడ్డి బావమరిది సృజన్‌రెడ్డికి చెందిన శోధా కన్‌స్ట్రక్షన్ కంపెనీకి ఎలాంటి అర్హతలు లేకపోయినా రూ. 1,137 కోట్ల విలువైన అమృత్ టెండర్లను అక్రమంగా కేటాయించారని మేం స్వయంగా కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ కట్టర్‌ను కలిసి ఆధారాలతో సహా ఫిర్యాదు చేస్తే, ఇప్పటిదాకా కనీసం ఒక్క మాట కూడా కేంద్ర ప్రభుత్వం మాట్లాడటం లేదు. బీజేపీకి నిజాయితీ ఉంటే కచ్చితంగా మాట్లాడాలి. ఈ కుంభకోణాల వెనుక ఉన్న రహస్యాలను ఛేదించాలి' అని కేటీఆర్ పేర్కొన్నారు.

> మీడియా ఎంత తాపత్రయపడ్డా, ఎన్ని ప్రకటనలు తీసుకున్నా రేవంత్‌రెడ్డి ఒక లొట్ట పీసు ముఖ్యమంత్రి అని ప్రజలకు అర్థమైపోయింది. మీడియా ఎన్ని దాచినా సోషల్ మీడియాతో ప్రజలకు వాస్తవాలు తెలుస్తూనే ఉంటాయి. -కేటీఆర్

> రేవంత్‌రెడ్డికి పిల్లనిచ్చిన మామ కాళేశ్వరంలో అవినీతి ఎక్కడిదని మీడియా ముందు ప్రశ్నిస్తున్నారు. మొత్తం ప్రాజెక్టుకు రూ. 94 వేల కోట్లు ఖర్చు అయితే అందులో రూ. లక్ష కోట్ల అవినీతి జరిగిందని ఎలా అంటారు? ఇదంతా అబద్ధమని రేవంత్‌రెడ్డికి పిల్లనిచ్చిన మామే చెప్తున్నారు. -కేటీఆర్

ఢిల్లీ టూర్లలో రేవంత్‌రెడ్డి రికార్డు

'17 నెలల్లోనే 44 సార్లు ఢిల్లీకి పోయిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అరుదైన రికార్డు సృష్టించారు. ఢిల్లీకి ఎందుకు పోతున్నారో ఇప్పుడు మాకు అర్థమైంది. చీకట్లో బీజేపీ పెద్దల కాళ్లు పట్టుకోవడానికి వెళ్తున్నారు. అమిత్‌షా కాళ్లు పట్టుకోవడం, ఈడీ కేసుల నుంచి తప్పించాలని వేడుకోవడం.. బయటికి వచ్చి పెద్ద పెద్ద పోజులు కొట్టడం. రేవంత్‌రెడ్డి 44 సార్లు ఢిల్లీకి పోయి చేసింది ఇదే. ప్రజలు కూడా అర్థం అయి ఉండాలి. ఒక్క ఇటుక పేర్చకుండానే, ఒక కొత్త ప్రాజెక్టు కట్టకుండానే, ఒక్క సంక్షేమ పథకాన్ని అమలు చేయకుండానే, ఒక్క హామీని అమలు చేయకుండానే లక్షా 80 వేల కోట్ల అప్పు చేసిండు. ఈ డబ్బులు ఎక్కడికి పోతున్నాయో ఇప్పుడైనా తెలంగాణ ప్రజలు అర్థం చేసుకోవాలి. ఏడాదిన్నర కాలంగా తెలంగాణ ప్రజల సంపదను దోచి, తెలంగాణను ఏటీఎంలా మార్చి, ఢిల్లీ బాసులకు రేవంత్‌రెడ్డి దోచిపెడుతున్నారు. రాహుల్‌గాంధీ అఫీషియల్ బాస్ అయితే నరేంద్ర మోదీ, అమిత్‌షాలు రేవంత్‌రెడ్డికి అనఫీషియల్ బాస్‌లు. వారిని ప్రసన్నం చేసుకోవడానికి ఎక్కే విమానం.. దిగే విమానం అన్నట్టుగా తయారైంది' అని కేటీఆర్ మండిపడ్డారు.

కుక్క తోక వంకర అన్నట్టు ఇప్పటికీ..

ఏడాదిన్నర కాలంగా సీఎం రేవంత్‌రెడ్డి మూడు పనులు మాత్రం చేశారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. 'బీఆర్ఎస్‌పై నిందలు.. బిల్డర్లు–కాంట్రాక్టర్లతో దందాలు.. ఢిల్లీ బాస్‌లకు వేలకోట్ల చందాలు. సంవత్సర కాలం నుంచి రేవంత్‌రెడ్డి చేస్తున్నది ఇదే. ఇది నిజంగా సిగ్గుచేటు. ఓటుకు నోటు కేసులో దొరికిన తర్వాత బుద్ధి వచ్చిందనుకున్నాం. కానీ, కుక్క తోక వంకర అన్నట్టు ఇప్పటికీ అవే అపసవ్యపు పనులు. అపసవ్యపు కార్యక్రమాలు చేసి తెలంగాణ పరువును తీసినందుకు తక్షణమే ఆయనను ముఖ్యమంత్రి పదవి నుంచి తొలగించాలి' అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

రేవంత్‌రెడ్డి మౌనం ఎందుకు?

దేశంలోని అన్ని విషయాలపై స్పందించే రాహుల్‌గాంధీ తన పార్టీకి చెందిన ముఖ్యమంత్రి పేరును ఈడీ చార్జిషీట్‌లో పేర్కొంటే ఎందుకు స్పందించడం లేదని కేటీఆర్ నిలదీశారు. 'దేశంలోని అన్ని విషయాలపై రాహుల్‌గాంధీ మాట్లాడతారు. పాకిస్థాన్, బంగ్లాదేశ్ గురించి మాట్లాడుతరు. మరి తన పార్టీ ముఖ్యమంత్రి చేస్తున్న ఈ అవినీతిపై ఎందుకు మాట్లాడటం లేదు. ఏ–1గా సోనియాగాంధీ, ఏ–2గా రాహుల్‌గాంధీ పేర్లను ఈడీ ఛార్జిషీట్లో చేర్చినప్పుడు దేశంలోని ప్రతి కాంగ్రెస్ నాయకుడు స్పందించారు. కానీ, రేవంత్‌రెడ్డి నోరు విప్పలేదు. రేవంత్‌రెడ్డి మాత్రం జపాన్ పర్యటన పేరుతో తప్పించుకొని ఇప్పటిదాకా ఆ విషయంపై మాట్లాడటం లేదు. తన పేరును కూడా చార్జిషీట్లో ఈడీ చేరుస్తుందన్న సమాచారం ఉండటంతోనే రేవంత్‌రెడ్డి మాట్లాడటం లేదు. కాంగ్రెస్ అంటేనే కరప్షన్. దాని డీఎన్ఏలోనే కరప్షన్ ఉన్నది' అని కేటీఆర్ విమర్శించారు.

కాంగ్రెస్ మంత్రులను మోదీ ఎందుకు కాపాడుతున్నారు?

పొంగులేటి ఇంట్లో ఈడీ సోదాలు జరిపి దాదాపు సంవత్సరం అవుతున్నది. కానీ, ఇప్పటిదాకా అటు ఈడీ వైపు నుంచి కానీ ఇటు పొంగులేటి వైపు నుంచి కానీ ఒక్క ప్రకటన కూడా రాలేదు. కాంగ్రెస్ మంత్రులపై చర్యలు తీసుకోవడానికి ఈడీకి, అటు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి ఎందుకు మొహమాటం? కాంగ్రెస్ మంత్రులను మోదీ ఎందుకు కాపాడుతున్నారు? పొంగులేటి ఇంట్లో డబ్బులు లెక్కబెట్టడానికి కౌంటింగ్ మిషన్‌లను కూడా తీసుకపోతున్న విజువల్స్ మీడియాలో వచ్చాయి. ఇప్పటిదాకా ఈ విషయంలో బీజేపీ స్పందించలేదు. తొమ్మిది నెలలైనా ఇరువర్గాల నుంచి ఎలాంటి స్పందన లేదు. రూ. 187 కోట్ల వాల్మీకి స్కామ్‌లో కర్ణాటకలో అరెస్టులు జరిగాయి. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా అందులో రూ. 45 కోట్లు తెలంగాణకు బదిలీ అయ్యాయి. ఆ రూ. 45 కోట్లు అందుకున్న కాంగ్రెస్ నాయకుల పేర్లు ఇప్పటిదాకా బయటికి రాలేదు. వాళ్లను విచారించాలని ఇప్పటిదాకా ఈడీ అనుకోలేదు. రూ. 45 కోట్లు తెలంగాణ కాంగ్రెస్ నేతలకు చేరాయని రిమాండ్ డైరీలో ఈడీ రాసింది. ఆ డబ్బులను లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి వాడారని ఆధారాలతో సహా స్పష్టం చేసింది. కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కుతో వాల్మీకి స్కాం కూడా బ్రహ్మ రహస్యంగానే మిగిలిపోయింది' అని కేటీఆర్ విమర్శించారు.

> రేవంత్‌రెడ్డికి రాహుల్‌గాంధీ అఫీషియల్ బాస్ అయితే నరేంద్ర మోదీ, అమిత్‌షాలు అనఫీషియల్ బాస్‌లు. వారిని ప్రసన్నం చేసుకోవడానికి ఎక్కే విమానం.. దిగే విమానం అన్నట్టుగా తయారైంది రేవంత్ పరిస్థితి. -కేటీఆర్

పిల్లనిచ్చిమామే కాళేశ్వరంలో అవినీతి అబద్ధమన్నారు

'పాలమూరు రంగారెడ్డి పథకంలో ఎలాంటి అవినీతి జరగలేదని, సీబీఐ దర్యాప్తు అవసరం లేదని సుప్రీంకోర్టు స్పష్టంగా తీర్పు చెప్పిందని కేటీఆర్ గుర్తుచేశారు. మరోవైపు సొంత పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులే 30 శాతం కమిషన్ ఇవ్వండి.. లేదంటే ఏ పని జరగదని బహిరంగంగానే చెప్తున్నారు. మంత్రులు పైసలు తీసుకొని పనులు చేస్తారని లేకపోతే ఫైల్స్ కదలవని క్యాబినెట్ సహచరులు మీడియా ముందు బయట పెడుతున్నారు. రేవంత్‌రెడ్డికి పిల్లనిచ్చిన మామ కాళేశ్వరంలో అవినీతి ఎక్కడిదని మీడియా ముందు ప్రశ్నిస్తున్నారు. మొత్తం ప్రాజెక్టుకు రూ. 94 వేల కోట్లు ఖర్చు అయితే అందులో రూ. లక్ష కోట్ల అవినీతి జరిగిందని ఎలా అంటారు? ఇదంతా అబద్ధమని రేవంత్‌రెడ్డికి పిల్లనిచ్చిన మామే చెప్తున్నారు. అందుకే, రేవంత్‌రెడ్డి ప్రస్టేషన్‌లో ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతున్నారు' అని కేటీఆర్ అన్నారు.

> దేశంలోని అన్ని విషయాలపై రాహుల్‌గాంధీ మాట్లాడతారు. పాకిస్థాన్, బంగ్లాదేశ్ గురించి కూడా మాట్లాడుతరు. మరి తన పార్టీ ముఖ్యమంత్రి పేరును ఈడీ ఛార్జిషీట్‌లో పేర్కొంటే ఎందుకు స్పందించడం లేదు. -కేటీఆర్

రేవంత్.. ఒక లొట్టపీసు ముఖ్యమంత్రి

ప్రస్టేషన్‌లో రేవంత్‌రెడ్డి ఏదేదో చేస్తుంటారని, లీకులు ఇస్తుంటారని కేటీఆర్ విమర్శించారు. నేషనల్ హెరాల్డ్ కేసులో రేవంత్ రెడ్డి పేరు వచ్చిందన్న వార్తను కొన్ని పత్రికలు అసలు రాయనే లేదని విమర్శించారు. 'మీడియా ఎంత తాపత్రయపడ్డా, ఎన్ని ప్రకటనలు తీసుకున్నా రేవంత్‌రెడ్డి ఒక లొట్ట పీసు ముఖ్యమంత్రి అని ప్రజలకు అర్థమైపోయింది. మీడియా ఎన్ని దాచినా సోషల్ మీడియాతో ప్రజలకు వాస్తవాలు తెలుస్తూనే ఉంటాయి' అని కేటీఆర్ తెలిపారు.

నెల రోజుల తర్వాత కార్యాచరణ

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల విషయంలో ఫైనాన్షియల్ ఫ్రాడ్ జరిగిందని సెంట్రల్ ఎంపవర్ కమిటీ స్పష్టంగా నివేదిక ఇచ్చి చర్యలు తీసుకోవాలని సూచించినా కేంద్ర ప్రభుత్వం స్పందించడం లేదని కేటీఆర్ మండిపడ్డారు. 'ప్రతిపక్ష నేతలపై మెరుపు వేగంతో స్పందించే కేంద్ర ప్రభుత్వం, కేంద్ర దర్యాప్తు సంస్థలు ఇక్కడ కాంగ్రెస్ నేతలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? ఎవరు ఎవరితో కుమ్మక్కవుతున్నారో తెలంగాణ ప్రజలు అర్థం చేసుకోవాలి. అమృత్ కుంభకోణంలో రేవంత్‌రెడ్డి బామ్మర్దిని కాపాడుతున్నది కేంద్ర ప్రభుత్వం. ఆర్ఆర్ ట్యాక్స్ పేరుతో బిల్డర్ల దగ్గర గజానికి రూ. 200 వసూలు చేస్తున్నా ఇప్పటిదాకా కేంద్ర ప్రభుత్వం ఒక్క మాట కూడా మాట్లాడటం లేదు. సివిల్ సప్లైస్కామ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కాపాడుతున్నది కేంద్రంలోని మోదీ ప్రభుత్వమే. సెంట్రల్ ఎంపవర్ కమిటీ రికమండేషన్ ఇచ్చిన తర్వాత కూడా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉలుకు పలుకు లేకుండా ఉన్నది. ఇప్పుడు ఈ నేషనల్ హెరాల్డ్ కేసులోనైనా కేంద్రం స్పందిస్తుందో లేదో వేచి చూస్తాం. ముఖ్యమంత్రిని ప్రాసిక్యూట్ చేయాలని గవర్నర్‌ను కలిసి కోరుతాం. ఇన్ని రోజుల నుంచి రక్షణ కవచంలాగా రేవంత్‌రెడ్డిని కాపాడుతున్న బీజేపీ ఇప్పటికైనా స్పందించకపోతే, నెల రోజుల తర్వాత కార్యాచరణను ప్రకటిస్తాం. ముఖ్యమంత్రిని కవచకుండలాల మాదిరిగా కాపాడుతున్న బీజేపీని, కేంద్ర ప్రభుత్వాన్ని ప్రజల ముందు ఎండగడతాం' అని హెచ్చరించారు.

తెలంగాణకు పట్టిన దయ్యం రేవంత్‌రెడ్డి!

- తెలంగాణకు పట్టిన శని కాంగ్రెస్ పార్టీ
- దానిని వదిలించడమే మా టార్గెట్
- ప్రజాస్వామిక స్ఫూర్తి కలిగిన మా పార్టీలో అధ్యక్షుడికి ఉత్తరాల ద్వారా సూచనలివ్వొచ్చు: కేటీఆర్

హైదరాబాద్, మే 24 (నమస్తే తెలంగాణ): 'తెలంగాణకు పట్టిన దయ్యం రేవంత్‌రెడ్డి.. తెలంగాణకు పట్టిన శని కాంగ్రెస్ పార్టీ' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు అన్నారు. ఆ దయ్యాన్ని, శనిని ఎలా వదిలించాలన్న దాని పైనే తాము పని చేస్తున్నామని చెప్పారు. తెలంగాణభవన్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎమ్మెల్సీ కవిత లేఖపై పలువురు మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు సావధానంగా సమాధానం చెప్పారు. ప్రజాస్వామ్య స్ఫూర్తి కలిగిన తమ పార్టీలో వివిధ రూపాల్లో సూచనలు చేసే డెమోక్రసీ ఉన్నదని చెప్పారు. 'లోక్‌సభ ఎన్నికలకు ముందు పార్లమెంట్ నియోజకవర్గాలవారీగా సమీక్ష సమావేశాలు పెట్టాం. అసెంబ్లీలో ఎన్నికల్లో ఓడిపోయాం. ముందుకు ఎలా పోవాలని రోజుకు ఏడెనిమిది, తొమ్మిది గంటలపాటు 17 రోజులు సమావేశాలు నిర్వహించాం. వేల మంది కార్యకర్తలతో చర్చించాం. ఆ ప్రాసెస్‌లో చాలామంది డైరెక్ట్‌గా మైక్‌లో మాట్లాడిన వాళ్లు ఉన్నారు. కొంతమంది చిట్టీల మీద రాసిచ్చిన వాళ్లు ఉన్నారు. ఇంకొందరు కేసీఆర్‌కు ఉత్తరం అందించండి అని లేఖలు ఇచ్చిన వాళ్లు ఉన్నారు. కాబట్టి మా పార్టీలో ప్రజాస్వామిక స్ఫూర్తి ఉన్నది. మా పార్టీ అధ్యక్షుడికి ఏవైనా సూచనలు, సలహాలు ఇవ్వాలనుకుంటే ఉత్తరాలు రాయొచ్చు. మా పార్టీలో డెమోక్రసీ ఉన్నది కాబట్టి పార్టీ నాయకులు, కార్యకర్తలు సలహాలు, సూచనలను అధ్యక్షుడికి లిఖితపూర్వకంగా, ఓరల్‌గా ఇవ్వొచ్చు. వాటిపై ప్రజాస్వామికంగా స్పందిస్తాం' అని కేటీఆర్ వివరించారు.

అంతర్గతంగా మాట్లాడితే బాగుంటది

పార్టీలో ఏ హోదాలో ఉన్నా పార్టీ అంతర్గత విషయాలను అంతర్గతంగా మాట్లాడితే బాగుంటుందని కేటీఆర్ సూచించారు. 'అధ్యక్షుడిని కలిసే అవకాశం ఉంది. వివిధ ఫోరమ్స్ ఉన్నాయి. ఆఫీస్ బేరర్స్ ఉన్నారు. వారిని కూడా కలిసే అవకాశం ఉన్నది. కాబట్టి కొన్ని విషయాలు అంతర్గతంగానే మాట్లాడితే బాగుంటుంది. ఇది అందరికీ వర్తిస్తుంది. వీళ్లు వాళ్లు అని కాదు. పార్టీలో అందరం కార్యకర్తలమే. ఇదే సూత్రం అందరికీ వర్తిస్తుంది. అన్ని పార్టీల్లోను కోవర్టులు ఉంటారు. అందులో రేవంత్‌రెడ్డి కోవర్టులు ఉంటే ఉండొచ్చు. వాళ్లు బయటపడే సమయం వచ్చినప్పుడు బయటపడ్తరు' అని కేటీఆర్ పేర్కొన్నారు.

ఓయూ ఇంజినీరింగ్ కాలేజీలో జరిగిన సెమినార్‌లో మాట్లాడుతున్న జగదీశ్‌రెడ్డి

కేసీఆర్ హయాంలోనే రాష్ట్రం నం.1

- ఎక్కడికెళ్లినా ప్రజల్లో ఇదే అభిప్రాయం వ్యక్తమవుతున్నది
- ఓయూ సెమినార్‌లో మాజీ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి వెల్లడి
- అబద్ధాలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది: దేవీప్రసాద్

సికింద్రాబాద్, మే 24: కేసీఆర్ హయాంలో దేశంలోనే తెలంగాణ నంబర్‌వన్‌గా నిలిచిందని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి తెలిపారు. తెలంగాణలో ఎక్కడికి వెళ్లినా "కేసీఆర్‌ను ఓడించి తప్పుచేశాం" అని ప్రజల్లో అభిప్రాయం వ్యక్తమవుతున్నదని చెప్పారు. ఉస్మానియా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ ఈసీఈ ఆడిటోరియంలో శనివారం "తెలంగాణ రాష్ట్రం–నీళ్లు, నిధులు, నియామకాలు" అంశంపై విద్యార్థి సంఘాలు నిర్వహించిన సెమినార్‌లో ముఖ్య అతిథిగా పాల్గొన్న జగదీశ్‌రెడ్డి.. బీఆర్ఎస్ హయాంలో పదేండ్లపాటు జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. నీళ్లు, నిధులు, నియామకాల రంగాల్లో సాధించిన పురోగతిని వివరించారు. అబద్ధాలతో ప్రజలను మభ్యపెట్టి, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. కాంగ్రెస్ అసత్య ప్రచారానికి బీజేపీ వంతపాడిందని మండిపడ్డారు. సీనియర్ జర్నలిస్ట్ టంకశాల అశోక్ మాట్లాడుతూ బీఆర్ఎస్ 'నీళ్లు, నిధులు, నియామకాలు' అనే నినాదంతోనే ఉద్యమం సాగించిందని చెప్పారు. సమైక్య ఆంధ్రప్రదేశ్ పాలనలో తెలంగాణ ఎలా ఉండేది?, స్వరాష్ట్రంలో ఎలా అభివృద్ధి చెందింది? అనే విషయంపై విద్యార్థులు పరిశోధన చేసి, ప్రజలకు వివరించాలని సూచించారు. టీఎన్జీవో మాజీ అధ్యక్షుడు దేవీప్రసాద్ మాట్లాడుతూ ఉద్యోగాల విషయంలో బీఆర్ఎస్ ప్రభుత్వంపై కాంగ్రెస్ పార్టీ అబద్ధాలు ప్రచారం చేసిందని మండిపడ్డారు. విద్యార్థులు, మేధావులు ప్రజలకు నిజాలను తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే గాదరి కిశోర్, తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఉపేందర్, జర్నలిస్టు యోగి, ఓయూ అధ్యాపకులు, న్యాయవాదులు, పరిశోధక విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు సతీశ్, విజయ్, నాగయ్య, వెంకట్, నవీన్ పాల్గొన్నారు.

నేషనల్ హెరాల్డ్ కేసులో రేవంత్ పాత్రేమిటి?

- సీఎం ఎందుకు స్పందించడం లేదు?: డీకే అరుణ

హైదరాబాద్, మే 24 (నమస్తే తెలంగాణ): నేషనల్ హెరాల్డ్ కేసులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాత్ర ఏమిటో ఆయనే సమాధానం చెప్పాలని బీజేపీ ఎంపీ డీకే అరుణ డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ.. నేషనల్ హెరాల్డ్ కేసులో రేవంత్‌రెడ్డి పేరును కూడా ఈడీ చేర్చినప్పటికీ ఆయన స్పందించకపోవడం వెనుక అనుమానాలున్నాయని పేర్కొన్నారు. ఈ కేసులో డబ్బులు ఇచ్చినట్టు కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ఒప్పుకున్నారని చెప్పారు. సీఎం రేవంత్ సైతం ఎంతమంది నుంచి డొనేషన్లు వసూలు చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి ఇప్పటికే ఓటుకు నోటు కేసులో ఉన్నారని ఎద్దేవా చేశారు.

నీరాకేఫ్‌ను నిర్వహించలేరా?

- బీఆర్ఎస్ హయాంలో నీరా కేఫ్‌ల విస్తరణకు ఏర్పాట్లు
- కాంగ్రెస్ పాలనలో నిలిచిన కార్యకలాపాలు
- గౌడన్నలకు అందని పరిహారం
- కల్లుగీత కార్పొరేషన్‌కు నీరా కేఫ్‌ను నడిపించే సత్తా లేదా?
- కార్పొరేషనే నిర్వహించాలి: గౌడ నేతల డిమాండ్

హైదరాబాద్, మే 24 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర గీత కార్మిక సహకార ఆర్థిక సంస్థ నామమాత్రంగా మారిపోయిందని, కాంగ్రెస్ పాలనలో నిరుపయోగంగా మారిందని గౌడ సంఘాల నేతలు విమర్శిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 17 నెలలు అవుతున్నా సంస్థకు చైర్మన్‌ను కూడా నియమించలేదని మండిపడుతున్నారు. నీరా కేఫ్ నిర్వహణ ద్వారా వచ్చే ఆదాయం నుంచి ప్రమాదవశాత్తు మృతిచెందిన కార్మికులకు పరిహారం అందించాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. కాంగ్రెస్ పాలనలో దాదాపు 200 మంది గీతకార్మికులు ప్రమాదవశాత్తు చనిపోయారని, వారి కుటుంబాలకు పరిహారం కింద రూ.10 కోట్ల వరకు చెల్లించాల్సి ఉందని చెప్పున్నారు.

మళ్లీ ప్రైవేట్ వ్యక్తులకే నీరాకేఫ్

తెలంగాణలో గౌడన్నల ఆత్మగౌరవం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టుగా నెక్లెస్‌రోడ్‌లో 'నీరాకేఫ్'ను నిర్మించింది. నాటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాలోని గౌడన్నల నుంచి అత్యాధునిక పద్ధతుల్లో నీరాను సేకరిస్తూ కేఫ్ ద్వారా విక్రయం జరుగుతున్నది. తాజాగా నీరా కేఫ్ నిర్వహణను కొందరు అనుచరులకు కట్టబెట్టేందుకు ప్రభుత్వ పెద్దలు కుట్ర చేస్తున్నారని గౌడ సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు. కేఫ్ నిర్వహణ కోసం పిలిచిన టెండర్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. గీత కార్పొరేషన్ ద్వారానే కేఫ్‌ను నిర్వహించాలని కోరుతున్నారు.

జిల్లాకొక నీరాకేఫ్ పెట్టాలి